హిమగిరి సొగసులు..



పచ్చని చెట్లు.. పక్షుల కిలకిల రావాలు... గలగల పారే సెల యేళ్లు... భువిని తాకినట్లు కొండలను కమ్మేసిన నీలిమేఘాలు. ఇలా.. ఉదయగిరి కొండలు ఊటీని తలపించాయి. కొండలను శనివారం మేఘాలు చుట్టేయడంతో కొత్త అందాలు వచ్చాయి. వీటిని చూసినవారు మైమరిచిపోయారు. కుండపోత వర్షంతో దుర్గం కొండతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సెల యేళ్లు గలగలపారాయి.

– న్యూస్‌టుడే, ఉదయగిరి

పేదల గూడులో.. అవినీతి గుట్టు



రూ.కోట్లలో దోపిడీ ● విజిలెన్స్ విచారణలో వైకాపా అక్రమాలు బహిర్గతం

'ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2019–24 వరకు జిల్లాలో నిర్మించిన పేదల ఇళ్ల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నాం. వాస్తవ నిర్మాణాలకు, అందుకు చెల్లించిన పేమెంట్లకు వ్యత్యాసం ఉంది. చాలాచోట్ల ఇవ్వాల్సిన దాని కంటే ఎక్కువగా ఇచ్చారు. నెల్లూరు రూరల్ పరిధిలో రూ.90వేలు అత్యధికంగా చెల్లించారు. ఇలా నిర్మాణ స్టేజీలను పరిశీలిస్తే దాదాపు రూ.18.50 లక్షలు అత్యధికంగా చెల్లించినట్లు తెలుస్తోంది. రూ.23.34 లక్షల విలువైన ఇనుముకు లెక్కలు కనిపించడం లేదు. నెల్లూరు రూరల్ పరిధిలో రూ.42.74 లక్షలు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి.' – ఇదీ గృహ నిర్మాణశాఖ విజిలెన్స్ విభాగం అధికారులు ఓ అధికారికి ఇచ్చిన నోటీసులోని అంశం.

● ఒక అధికారే కాదు.. గత అయిదేళ్లలో పనిచేసిన 53 మంది ఏఈలు, 17 మంది డీఈలు, 10 మంది ఈఈల నుంచి వివరణ కోరారు. వివరణ తీసుకున్న తర్వాత.. ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు.

ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, బృందావనం

వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం పేరుతో చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఆప్షన్-3 ద్వారా అందరికీ నాణ్యమైన ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం మోసం చేస్తే.. వైకాపా నాయకులే గుత్తేదారుల అవతారమెత్తి దోపిడీకి పాల్పడ్డారు. ఇనుము, ఇసుక, సిమెంట్ పక్కదారి పట్టించడంతో పాటు.. ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు కాజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమాలపై సీఎం స్థాయిలో దృష్టి పెట్టడంతో అక్రమార్కులు వణికిపోతున్నారు.



కొండ్లపూడి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు (పాత చిత్రం)

రూ.120 కోట్లు పక్కదారి

కొందరు కాంట్రాక్టర్లు నగదు, సామగ్రి తీసుకుని ఇళ్లను ప్రారంభించలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధారాలతో సహా ముఖ్యమంత్రికి సమర్పించారు. స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. జిల్లాలో సుమారు రెండు నెలల పాటు విచారణ చేశారు. ప్రతి లేఅవుట్‌లో అక్రమాలను గుర్తించారు. ఆన్‌లైన్‌లో చూపిస్తున్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఉన్నవాటికి పొంతన లేకపోవడంతో ఆశ్చర్యపోయారు. రూ.కోట్ల విలువైన సిమెంట్, స్టీలు, ఇసుకను పక్కదారి పట్టించారని, దీనికి సంబంధించిన రికార్డులు లేవని గుర్తించారు. వీటిని మొత్తం లెక్కించిన అధికారులు రూ.120 కోట్లకుపైగా దుర్వినియోగం జరిగినట్లు తేల్చారు. వీటిలో నెల్లూరు అర్బన్‌లో రూ.21 కోట్లు, కావలిలో రూ.22 కోట్లు, సర్వేపల్లిలో రూ.10 కోట్లకుపైగా ఉన్నట్లు సమాచారం.

నాణ్యతపై పట్టింపేదీ.. జగనన్న కాలనీల్లో జరిగిన అతి పెద్ద అవినీతి.. నాణ్యత లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టడమే. ఆప్షన్-3 ద్వారా అవకాశం దక్కించుకున్న గుత్తేదారులు సిమెంట్, స్టీలు, ఇసుకను పక్కదారి పట్టించి, కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్మించారు. అవి ప్రారంభానికి ముందే పడిపోయిన ఘటనలు కోకొల్లలు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. విజిలెన్స్‌కు విచారణ ఆదేశించింది. వారు కేవలం క్షేత్రస్థాయిలో నిర్మాణాలు, ఆన్‌లైన్‌లో లెక్కలకు పోల్చడం వరకే పరిమితం అయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం రికార్డులను పరిశీలిస్తేనే.. రూ.120 కోట్లు దుర్వినియోగం అయినట్లు తెలితే.. పూర్తిస్థాయిలో నాణ్యతపై విచారణ జరిగితే భారీ కుంభకోణం వెలుగుచూసే అవకాశముందని లబ్ధిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వివరణ ఇవ్వాలని కోరాం..

గృహ నిర్మాణశాఖ పీడీ టి.వేణుగోపాల్‌ను వివరణ అడగ్గా.. జగనన్న కాలనీల్లో 2019-24ల్లో పేదలకు నిర్మించిన ఇళ్లపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న మాట నిజమే. కొన్నిచోట్ల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఆ సమయంలో పనిచేసిన అధికారులను వివరణ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

జిల్లాలో మొత్తం ఇళ్లు	ఆప్షన్-3లో 180 మంది గుత్తేదారులకు అప్పగించినవి	ఈ ఏడాది జూన్ వరకు పూర్తిచేసినవి	ప్రారంభించనివి	కాంట్రాక్టర్లకు అందజేసిన నగదు
85,344	29,238	5,954	1024	రూ.340 కోట్లు

దీపావళి తరువాత స్టేడియం ప్రారంభం

స్పందనకు వందనం

నెల్లూరు(క్రీడా విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణం మండలం మొగళ్లపాలెంలో నిర్మించిన బహుళజాతి ఇండోర్ మైదానాన్ని దీపావళి తర్వాత ప్రారంభిస్తామని శాప్ ఛైర్మన్ రవినాయుడు స్పష్టం చేశారు. పనులు పూర్తయినా స్టేడియం ప్రారంభం కాకపోవడంపై 'అయిదేళ్లుగా.. ఆటకు నిరీక్షణే' శీర్షికన శనివారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. నెల్లూరు పర్యటనకు వచ్చిన ఆయన కథనంపై స్పందించారు. దీపావళి అనంతరం ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులు పూర్తిచేయాలని తెలిపారు.

పొగాకు రైతుకు కాసుల పంట

రేపటితో ముగియనున్న వేలం



వేలం కేంద్రంలో ఉంచిన పొగాకు బేళ్లు

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

ఈ ఏడాది రైతులకు పొగాకు పంట కాసుల వర్షం కురిపించింది. రికార్డుస్థాయి ధరలతో సీజన్ ముగిసింది. మూడేళ్ల నుంచి వస్తున్న లాభాలతో వచ్చే ఏడాది కూడా సాగుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో పొలాల కౌలు, బ్యారన్ల లీజు ధరలు ఊహించని స్థాయిలో పెరిగిపోతున్నాయి. 2023-24 సీజన్‌కు సంబంధించి జిల్లాలో మొత్తం 46.8 మిలియన్ కిలోల అమ్మకాలు జరగ్గా, అత్యధిక సరాసరి ధరలు నమోదయ్యాయి.

మార్చి 6న వేలం ప్రారంభమై..

ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలో ఆరు వేలం కేంద్రాలు ఉండగా, అందులో జిల్లా పరిధిలోని కందుకూరు-1, కందుకూరు-2, డీసీపల్లి, కలిగిరి ఉన్నాయి. జిల్లాలోని నాలుగు వేలం కేంద్రాల్లో మార్చి 6న కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. బోర్డు అనుమతించిన పంటకు అదనంగా వచ్చిన దిగుబడికి సైతం అపరాధ రుసుం, జరిమానా లేకుండా బోర్డు ద్వారా అమ్ముకోవచ్చని చెప్పడం రైతులకు ఊరటనిచ్చింది. కలిగిరి, డీసీపల్లి, కందుకూరు-2 కేంద్రాల్లో ఈనెల 14తో వేలం ముగియగా, కందుకూరు-1లో ఈనెల 21వ తేదీ చివరి రోజుగా నిర్ణయించారు.

మేలిమి రకం కిలో రూ.360

140 రోజులకు పైగా వేలం ప్రక్రియ సాగింది. గతేడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పంట సాగుచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న డిమాండ్ దృష్ట్యా ఎన్నడూ లేనంతగా ధరలు లభించాయి. మేలిమి రకం కిలో గరిష్ఠంగా రూ.360 పలికింది. ఎస్ఎల్ఎస్ పరిధిలో ఇంత ధర లభించడం ఇదే తొలిసారి. అన్ని రకాల పొగాకును వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేయడంతో మంచి ధరలు లభించాయి. కందుకూరు-2 వేలం కేంద్రంలో 2022-23 సంవత్సరం కిలో సరాసరి రూ.220 ఉండగా, 2023-24లో సరాసరి రూ.270 ఉంది. గతేడాదితో పోలిస్తే కిలోకు రూ.50 అదనంగా లభించింది. ఒక్కో బ్యారన్‌కు కనీసం రూ.5 నుంచి రూ.8లక్షల వరకు ఆదాయం లభించింది. రాబోయే సంవత్సరం బ్యారన్‌కు 6 క్వింటాళ్లు అదనంగా అనుమతిచ్చారు. అధికంగా సాగు చేయొద్దని, బోర్డు అనుమతిచ్చిన మేరకే సాగు చేయాలని అధికారులు హెచ్చరిస్తున్నా.. రైతులు మాత్రం పోటాపోటీగా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

పరిమితికి మించి సాగుచేయొద్దు

బోర్డు ఇచ్చిన పరిమితికి మించి రైతులు సాగుచేయొద్దు. ఏటా ధరలు యథావిధిగా ఉంటాయని ఎవరూ చెప్పలేరు. అధిక ధరలతో కౌలుకు పొలాలు, బ్యారన్లు తీసుకుని నష్టపోవద్దు. అనధికారికంగా బ్యారన్లు నిర్మించడం చట్టరీత్యా నేరం. ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– రాజగోపాల్‌రెడ్డి, కందుకూరు–2 వేలం కేంద్రం నిర్వహణాధికారి

రూ. 102 కోట్లతో నెల్లూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి

నెల్లూరు (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.1397.04 కోట్లతో రాష్ట్రంలోని 53 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తోందని విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌ను రూ. 102 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ 2023 ఆగస్టులో ఈ పథకాన్ని ప్రారంభించారని వివరించారు.

బీసీ వసతిగృహాల్లో డిజిటల్ తరగతులు



పొదలకూరులోని బీసీ బాలికల వసతిగృహం

న్యూస్‌టుడే, దుత్తలూరు, ఉదయగిరి

ప్రభుత్వ వసతి గృహాల్లో నూతన బోధనకు బాటలు పడుతున్నాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు చెప్పనున్నారు. తొలిసారిగా బీసీ సంక్షేమ వసతిగృహాల్లో డిజిటల్ బోధనకు సంబంధించి రీసోర్సు సెంటర్లను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. గత వైకాపా పాలనలో

నవంబరు 14 నాటికి అందుబాటులోకి వచ్చేలా..

జిల్లాలో పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు ప్రీమెట్రిక్ వసతిగృహాలు 53 ఉన్నాయి. వీటిల్లో మూడువేల మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. డిజిటల్ విద్యాబోధనకు సంబంధించి మొదటి విడతగా జిల్లాలో నాలుగు బీసీ వసతిగృహాల్లో డిజిటల్ తరగతులు ప్రారంభించేలా ప్రతిపాదనలు పూర్తయ్యాయి. సొంత భవనాలు పటిష్ఠంగా ఉన్న పొదలకూరులోని బీసీ బాలికల వసతిగృహం, అదే మండలం మహ్మదాపురంలోని బాలుర, ఆత్మకూరులోని బాలికల, కావలిలోని బాలుర వసతిగృహాలను ఎంపిక చేశారు. వీటిలో నవంబరు 14న బాలల దినోత్సవం నాటికి తరగతులు అందుబాటులోకి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

బోధన ఇలా...

డిజిటల్ బోధనకు ఎంపికైన వసతిగృహాల్లో ఓ గదిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతారు. అందులో డిజిటల్ ఇంటరాక్టివ్ ప్యానల్ ఏర్పాటు చేస్తారు. వీటి వసతుల ఏర్పాటుకు ఒక్కో వసతిగృహానికి రూ.కోటి వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పదో తరగతి విద్యార్థుల అనుమానాల నివృత్తికి ఈ రీసోర్సు సెంటర్లు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు. అలాగే ఎంపిక చేసిన వసతిగృహాల్లో ప్రత్యేకంగా ట్యూటర్లను కూడా నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వీరు గణితం, సైన్సు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులను బోధించనున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.15వేల వంతున వేతనం ఇస్తారు.

జిల్లాలో నాలుగు ఎంపిక

బీసీ వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉండేది. వారికి సకాలంలో కాస్మోటిక్ ఛార్జీలు సైతం విడుదల చేసిన దాఖలాల్లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయి

తొలుత సొంత భవనాలు ఉన్న వసతిగృహాలను డిజిటల్ బోధనకు ఎంపిక చేశాం. విడతలవారీగా అన్నింటిలో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డిజిటల్ విధానంలో విద్యాబోధనతో విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయి. ముఖ్యంగా పదో తరగతి చదివే వారికి ఎంతో ఉపయోగపడతాయి.

– ప్రసూన, ఇన్‌ఛార్జి జిల్లా బీసీ సంక్షేమాధికారిణి

పశ్చిమాన కుండపోత

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉదయగిరి మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. ఉదయం 8 గంటల్లోపు 19.6 మి.మీ., సాయంత్రం 5 గంటల వరకు 92.4 మి.మీ. వర్షం నమోదైంది. ఉదయగిరి పట్టణంలో వీధులు, రోడ్లు, పంచాయతీ బస్టాండ్ ప్రాంగణం వర్షపు నీటితో నిండిపోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బోడబండ- బండగానిపల్లి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

● **దుత్తలూరు:** మండలంలో కూడా ఉదయం కుండపోత వర్షం కురిసింది. ముత్తరాశిపల్లి వద్ద గూబల వాగు, ఏరుకొల్లు సమీపంలో కావేరి వాగులు ఉద్ధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దుత్తలూరు పంచాయతీలోని బీసీ కాలనీలతోపాటు పలు కాలనీల్లో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. దుత్తలూరు చెరువు కట్టపై పది విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి.. సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



వర్షపు నీటిలో ఉదయగిరి పంచాయతీ బస్టాండ్

చిత్రం.. కళాత్మకం



కాలంచెల్లిన కారం, పసుపు పొడులతో రూపొందించిన భారీ వర్లీ చిత్రం వద్ద అమీర్‌జాన్ (పాత చిత్రం)

గిన్నిస్‌తో పాటు 45 రికార్డులు సాధించిన చిత్రకారుడు అమీర్‌జాన్



కార్యాచరణతో నిరంతర సాధన చేస్తూ.. సంకల్ప బలంతో కలల తీరం చేరారు. ప్రతిభకు పేదరికం అడ్డురాదని రుజువు చేస్తూ.. భిన్నమైన ఆలోచనలతో చిత్రాలకు కళాత్మక సొబగులద్ది అరుదైన రికార్డులు సొంతం చేసుకున్నారు. స్ఫూర్తిగా నిలిచిన ఆయనే నెల్లూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు.. షేక్ అమీర్‌జాన్.

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

చేజర్ల మండలం చిత్తలూరుకు చెందిన షేక్ మాబూసాహెబ్, మస్తాన్‌బీ దంపతుల కుమారుడు.. అమీర్‌జాన్. ఆసక్తితో మైసూరులో చిత్రకళలో డిగ్రీ, డ్రాయింగ్ టీచర్ శిక్షణ పూర్తిచేశారు. ప్రభుత్వం డ్రాయింగ్ టీచర్ల నియామకం నిలిపివేయడంతో నిరుత్సాహం చెందకుండా నేర్చుకున్న విద్యనే ఉపాధికి ఆసరాగా చేసుకుని పొదలకూరులో అమీర్‌ఆర్ట్స్ ఏర్పాటు చేసి బ్యానర్లు, బోర్డులు చిత్రిస్తూ పేరుతెచ్చుకున్నారు. ప్రత్యేకమైన గుర్తింపునకు సూక్ష్మచిత్రకళపై దృష్టి సారించారు. జాతీయ స్థాయిలో పలు నగరాలలో జరిగిన చిత్రకళా ప్రదర్శనల్లో పాల్గొని 45కి పైగా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకుని రాష్ట్రస్థాయి చిత్ర కళాకారుడిగా పేరుతెచ్చుకున్నారు.

గిన్నిస్ రికార్డు సాధన ఇలా..

గిన్నిస్ రికార్డు సాధించేందుకు పెద్ద ప్రయత్నమే చేశారు. నెల్లూరులో 2022 ఫిబ్రవరి 2న పాడైన కారం, పసుపు పొడులు వినియోగించి 6.30 గంటల్లో 790 చదరపు అడుగుల భారీ చిత్రాన్ని చిత్రించారు. దీనికి ఆగస్టు 24న గిన్నిస్ రికార్డులో స్థానం పొందారు. ఈ ఏడాది ఆగస్టు 13న చెన్నైలో జరిగిన యూత్ ఫెస్టివల్ సందర్భంగా చిత్ర కళలో ప్రతిభ చూపి అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. గత ఆదివారం హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో క్రియేటివ్ ఆర్ట్స్ సంస్థ నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నారు.

పురస్కారాలు ఇలా..

2012 జనవరి 21 నెల్లూరు టౌన్‌హాల్‌లో 63వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని చింత గింజలపై 63 మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను 6 గంటల 12 నిమిషాల్లో చిత్రించి ఇండియా బుక్ రికార్డు దక్కించుకున్నారు. టెంకాయపై చిత్రించిన 200 సూక్ష్మ వినాయక చిత్రాలకు, ఒకే చిత్రంలో 1296 సూక్ష్మ వినాయక చిత్రాలకు రెండు సార్లు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందారు.

చిత్రకారులను ప్రోత్సహిస్తూ..

నెల్లూరు టెక్కేమిట్టలోని పావని హోమ్స్‌లో అమీర్‌ఆర్ట్స్ అకాడమీ శిక్షణాలయాన్ని నిర్వహిస్తూ భావి తరాలకు చిత్రకళలో చిత్రకారులను తీర్చిదిద్దుతున్నారు. 2014లో అమీర్‌ఆర్ట్స్ అకాడమీని స్థాపించి ఏటా నెల్లూరులో జాతీయ స్థాయిలో చిత్రకళా పోటీలు నిర్వహిస్తూ విజేతలకు బంగారు పతకాలు అందిస్తున్నారు.



ప్రకృతి రమణీయతలో రాతిపొరల అందాలను తాకుతూ ఉదయగిరి దుర్గం కొండపై నుంచి కిందకు దూకే జలపాతం సోయగం చూపరులను కట్టిపడేస్తూ కనువిందు చేస్తోంది. ఉదయగిరిలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి దుర్గం కొండపై ఉండే సల్పాపేట జలపాతం జలజలా పారుతోంది. ప్రవహిస్తోంది. సందర్శకులు ఈదృశ్యాన్ని చరవాణీల్లో బంధించారు. - న్యూస్‌టుడే, ఉదయగిరి

లక్ష్యాలు పూర్తి చేయాలి: పీడీ

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు డిజిటల్ మార్కెటింగ్‌లో కూడా అమ్మకాలు చేస్తూ ఆదాయం పెంపొందించే విధంగా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. శనివారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏసీ, ఏపీఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెర్ప్ నుంచి 1200 ఉత్పత్తుల వివరాలను ఓఎన్‌డీసీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తూ ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. జిల్లాలోని వీవోలు ద్వారా ఆదిశగా పనిచేయాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి నుంచి ఆర్థికంగా చేయూతనిస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పీపీడీ రాజు, ఏసీలు, ఏపీఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

రబీపై ఆశలు

4.50 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా

న్యూస్‌టుడే, నెల్లూరు(వ్యవసాయం)

తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్ సీజన్ రైతులకు నిరాశే మిగిల్చింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రబీలో పంటల సాగుకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుత రబీ సీజన్ ప్రారంభమైంది. 5.5లక్షల ఎకరాలకు పైగా పంటల సాగు జరుగుతుందని అంచనా. సోమశిల జలాశయంలో భారీగా వరద చేరుతోంది. ఎగువ నుంచి వస్తున్న నీటితో పాటు ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు 58.269 టీఎంసీలకు చేరింది. కండలేరుతోపాటు కలిగిరి, సర్వేపల్లి తదితర రిజర్వాయర్లతోపాటు పెద్ద, చిన్న చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి.



ట్రాక్టర్‌తో పొలం సిద్ధం చేస్తున్న రైతు

వ్యవసాయశాఖ అంచనాల తయారీ

రబీ సీజన్‌లో వ్యవసాయశాఖ అంచనాలు తయారు చేసింది. మొత్తం సాగు అంచనాల్లో 4.5లక్షల ఎకరాల్లో వరి, మిగతా లక్ష ఎకరాల్లో వేరుసెనగ, శనగ, మినుము, రాగులు, జొన్నలు, మిరప తదితర పంటల సాగు జరుగుతుందని లెక్కకట్టింది. ప్రస్తుతం పెన్నా డెల్టా ప్రాంతంలో సాగు పనులు మొదలవుతున్నాయి. నారుమడుల సాగుకు పొలాలు సిద్ధం చేస్తున్నారు.

2.28 లక్షల మె.టన్నుల ఎరువులు అవసరం

రబీ సీజన్‌లో 2.28లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో 1.9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 18వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 12వేల మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 9600 మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌పీ, 79,400 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అవసరమని తేల్చారు. యూరియా- 13,512 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4,006, ఎంవోపీ- 1,194, కాంప్లెక్స్ ఎరువులు- 13,814, ఎస్ఎస్‌పీ- 364 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచారు. వీటిని అధీకృత డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

జిల్లాలో ఎన్ఎల్ఆర్ 34449, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048 తదితర వరి రకాల సాగు జరుగుతుంది. 64,019 క్వింటాళ్ల వరి విత్తనాలు, 35,981 క్వింటాళ్ల ఇతర పంటల విత్తనాలు అవసరమవుతాయని వ్యవసాయశాఖ అంచనాలు వేయగా.. అధీకృత ప్రైవేటు డీలర్ల ద్వారా దాదాపు 80వేల క్వింటాళ్లు, ఏపీ సీడ్స్ ద్వారా మరో 12వేల క్వింటాళ్ల విత్తనాలు, మిగిలిన 8వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులు, వ్యవసాయ క్షేత్రాల నుంచి అందుతాయని అంచనా వేస్తున్నారు. బీపీటీ5204 రకం 900 క్వింటాళ్లు, కెఎన్ఎం1638 రకం 4500, ఎన్ఎల్ఆర్34449 రకం 800 క్వింటాళ్లు రాయితీపై రైతులకు అందించేందుకు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఆర్ఎన్ఆర్15048, ఎన్ఎల్ఆర్ 3354 రకాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతులకు సమస్యలు రాకుండా చేస్తున్నాం

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రబీ సీజన్‌లో విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంచుతున్నాం. వరి విత్తనాలు రాయితీపై అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

క్రీడా రంగానికి పూర్వ వైభవం

శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: క్రీడా రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని.. పది రోజుల్లో నూతన విధానాన్ని ప్రకటిస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. శనివారం నగరానికి వచ్చిన ఆయన మొగళ్లపాలెంలోని ఇండోర్ మైదానాన్ని సందర్శించారు. అనంతరం ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, శిక్షకులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో 4039 పాఠశాలలను గుర్తించి ఆట స్థలాల ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్లు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. క్రీడా రంగం అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, ప్రజా ప్రతినిధులు, ఔత్సాహికులు, మాజీ క్రీడాకారులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా చూడాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, క్రీడా శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఇండోర్ మైదానాన్ని పరిశీలిస్తున్న రవినాయుడు, రవిచంద్ర తదితరులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట పోలీసు స్టేషన్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు దస్త్రాలు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంచాలని సిబ్బందికి సూచించారు. ముందుగా పోలీసు సిబ్బంది యోగక్షేమాలను అడిగి, ఏమైనా సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా పెట్టాలన్నారు. చోరీ కేసుల్లో రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విచారణలో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ద్విచక్రవాహనాలను నడిపే పోలీసు సిబ్బంది, అధికారులు తప్పక శిరస్త్రాణం ధరించాలన్నారు. ఆయన వెంట ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ. 7,498
సవర ధర:	రూ. 59,984
వెండి గ్రాము :	రూ. 102.30

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	249
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	140
లేయర్	115
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	195

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని రూ.30 లక్షలకు టోకరా

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని రూ.30 లక్షలు కాజేసిన నిందితులపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మాగుంట లేఅవుట్‌లో సుధీర్ కుటుంబం నివాసం ఉంటుంది. ఆయన తన కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు కోసం ప్రయత్నిస్తుండగా క్రాంతి నగర్‌కు చెందిన విజయకుమార్, సునీల్ పరిచయమయ్యారు. సీటు ఇప్పిస్తామని చెప్పి పలుమార్లు రూ.30 లక్షలు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా ఇప్పించకపోవడంతో వారిని ప్రశ్నించారు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇటీవల సుధీర్ వారిని గట్టిగా నిలదీయడంతో సరైన సమాధానం లేదు. ఈ మేరకు బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మకూరు అభివృద్ధికి పెద్దపీట

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో అనంతసాగరం మండల తెదేపా నాయకులతో శనివారం మంత్రి ఆనం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోమశిల జలాశయం, హైలెవల్ కెనాల్, ఉత్తర కాలువ, సంగం బ్యారేజి వంటి సాగునీటి ప్రాజెక్టులు, మూడు జాతీయ రహదారులు, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ వంటి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆత్మకూరు అభివృద్ధితో పాటు అయిదేళ్లలో పరిశ్రమలు, నీటిపారుదల ప్రాజెక్టులు, రెసిడెన్షియల్, స్కిల్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ఉన్న వారు వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లొచ్చని స్పష్టం చేశారు. ఏ అధికారైన అడ్డుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి సోమవారం నియోజకవర్గ స్థాయిలో ఏదైనా ఒక మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తాను పాల్గొంటానని పేర్కొన్నారు. తెదేపా నాయకులు ధనుంజయరెడ్డి, సునీత, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రావు, సుజాతమ్మ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ఉదయగిరి బ్రాంచ్ (13470)
డి.నెం. #12-234, అన్నపూర్ణ కాంప్లెక్స్, ఉదయగిరి, నెల్లూరు, ఏపి-524226

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **మరణించిన ఋణగ్రహీత లేటు శ్రీ ఎస్. వెంకటేశ్వర రెడ్డి యొక్క చట్టబద్ధమైన వారసులు: 1) శ్రీమతి శనివారపు పండరి కుమారి, 2) శ్రీ శనివారపు శ్రీలక్ష్మి రమణి, 3) శ్రీ శనివారపు గణేష్ రెడ్డి, 4) శ్రీ శనివారపు ప్రీతం రెడ్డి మరియు హామీదారులు: 1) శ్రీ నేదురుమల్లి శ్రీనివాసులు రెడ్డి, 2) శ్రీ ఎస్. సిద్దా రెడ్డి** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ.12,90,863.96/- (అక్షరాల పన్నెండు లక్షల తొంభై వేల ఎనిమిది వందల అరవై మూడు రూపాయలు మరియు తొంభై ఆరు పైసలు)** + తదుపరి వడ్డీ మరియు ఒకవేళ ఛార్జీలు ఏమైనా ఉంటే అవి కలిపి మొత్తంను సదరు నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది **20.07.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని తేది **18.10.2024న స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత యొక్క చట్టబద్ధమైన వారసులకు, హామీదారు మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత యొక్క చట్టబద్ధమైన వారసులకు, హామీదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి 18.10.2024 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 13,30,966.96 (అక్షరాల పదమూడు లక్షల ముప్పై వేల తొమ్మిది వందల అరవై ఆరు రూపాయలు మరియు తొంభై ఆరు పైసలు)** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఉదయగిరి సబ్ రిజిస్ట్రేషన్, ఉదయగిరి మండలం, ఉదయగిరి గ్రామపంచాయితీ, కొండాయపాలెం గ్రామం, సర్వే నెం. 106 & 107, అసెస్‌మెంట్ నెం. 1937, ఉదయగిరి నుండి గండిపాలెం రోడ్డు తూర్పువైపు, సమీప డోర్ నెం. 1-92 నందు మొత్తం స్థలం 302.22 చ॥గ॥లలో 207.82 చ॥గ॥ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్, 1వ అంతస్తు, రెండవ అంతస్తు 1632 చ॥అ॥ మరియు మూడవ అంతస్తు 299.7 చ॥అ॥ (మొత్తం విస్తీర్ణం 5195.7 చ॥అ॥) ఆర్‌సిసి బిల్డింగ్ మరియు 127.12 చ॥అ॥ ఎసిసి ఇల్లు. **హద్దులు:** తూర్పు: గోగుల వెంగళరావు ఇల్లు, పడమర: పులిమి వెంకట రమణా రెడ్డి ఖాళీ స్థలం, ఉత్తరం: శనివరపు వెంకటేశ్వర్లు రెడ్డి ఇల్లు, దక్షిణం: పంచాయితీ రోడ్డు, ఈ హద్దులలో ప్రవేశం, నిష్క్రమణ మొ॥ అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో.

తేదీ: 18.10.2024, ప్రదేశం: ఉదయగిరి | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

మంత్రి ఇంటి వద్ద అనుమానిత వ్యక్తి

నెల్లూరు, న్యూస్‌టుడే: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంటి వద్ద అనుమానంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని గుర్తించి సంతపేట పోలీసులకు అప్పగించారు. సంతపేట వద్ద గల తన ఇంట్లో మంత్రి రెండు రోజులుగా ఆత్మకూరు నియోజకవర్గంలోని మండలాల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన సమావేశానికి అనంతసాగరానికి చెందిన వైకాపా కార్యకర్త స్వామి మాల వేసుకుని హాజరుకాగా. . ఆనం అనుచరులు, తెదేపా నాయకులు గుర్తించి.. ఎందుకు వచ్చావంటూ నిలదీయగా.. సమావేశాలు గురించి తెలుసుకునేందుకు వచ్చినట్లు సమాధానం ఇచ్చారు. నాయకులు ఆయన్ని పోలీసులకు అప్పగించారు.

సిండికేట్‌లో భాగం కాలేదని.. మద్యం దుకాణంపై దాడి

కావలి, న్యూస్‌టుడే: తాము కోరినట్లు సిండికేట్‌లో భాగం కాలేదని ఓ మద్యం దుకాణంపై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన కావలి మండలం రుద్రకోట వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గ్రామం వద్ద రెండు మద్యం దుకాణాల ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. ప్రభుత్వం తెలిపిన మార్గదర్శకాల ప్రకారం మండలం లేక మున్సిపాలిటీగా వాటి పరిధిలో అనుమతులు పొందిన వారు ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ క్రమంలో దుకాణాన్ని పొందిన వ్యక్తి రుద్రకోట వద్ద ఏర్పాటు చేశారు. కొందరు వ్యక్తులు సిండికేట్‌లో భాగస్వామి కావాలంటూ గత రెండు రోజులుగా సదరు వ్యక్తిపై బెదిరింపులకు పాల్పడ్డారు. వారి మాటను లెక్క చేయక దుకాణం ప్రారంభిస్తుండటంతో సుమారు ఏభై మంది దుకాణంలో ఉన్న మద్యం కేసులను ధ్వంసం చేశారు. మరికొన్ని పట్టుకుని పోయారు. బాధిత దుకాణదారుడు పోలీసులను, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారుగా రూ.8లక్షల విలువైన సరకును తీసుకునిరాగా, ఈ ఘటనతో లెక్కతేలడం లేదని ఆవేదన చెందారు. ఈ సమాచారం అందుకున్న ఓ ప్రజా ప్రతినిధి స్పందించారు. ఆయన సూచన మేరకు పోలీసులు రుద్రకోటలోని రెండు దుకాణాలను మూయించి వేశారు. అక్కడ పికెట్ ఏర్పాటు చేశారు.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



కావలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ అన్నారు. శనివారం న్యాయస్థాన ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు మొక్కలు నాటడం అనేది అందరూ అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి విక్రమసింహ, ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పరశురామన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమంలో న్యాయమూర్తి శోభ తదితరులు

ప్రయాణికులకు బహుమతుల అందజేత



ఉదయగిరి, న్యూస్‌టుడే: ప్రయాణికుల ఆదరణ పొందేందుకు సీతారామపురం మార్గంలో తిరిగే బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా విజేతలైన ప్రయాణికులకు శనివారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ మార్గంలో తిరిగే ప్రయాణికులు బస్సుల్లో ఏర్పాటైన బాక్సుల్లో టిక్కెట్లు వేయటం జరిగింది. ఆ టిక్కెట్లను లాటరీ ద్వారా తీయగా షేక్ మస్తాన్, చెన్నయ్యలు పేర్లు రావటంతో వారిని డిపోనకు పిలిపించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న డీఎం శ్రీనివాసరావు

అయిదేళ్ల వైకాపా పాలనలో దోపిడీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, న్యూస్‌టుడే: వైకాపా అయిదేళ్ల పాలనలో రాష్ట్రంలో అన్నివిధాలుగా దోపిడీకి పాల్పడి ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు జరిగే పల్లె పండగ కార్యక్రమంలో జక్కవరంలో రూ.22.60 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం జరగనున్నట్లు తెలిపారు. తాగునీరు, ఇతర సమస్యలపై దృష్టిసారించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకెళుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీవో అన్నపూర్ణ, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబునాయుడు, మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ వెంకటరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్, సర్పంచులు పద్మ, వెంకటస్వామి, నాయకులు, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శనివారం తెదేపా జాతీయ కార్యాలయంలో తెదేపా ముస్లింమైనార్టీ సెల్ రాష్ట్ర అధికారప్రతినిధి షేక్‌రఫి వినతిపత్రం ఇచ్చారు. టైలర్లకు 50 ఏళ్లకు పింఛను ఇవ్వాలని, విద్యుత్‌లో రాయితీ కల్పించాలని, ప్రభుత్వ విద్యార్థులకు ఇచ్చే ఏకరూప దుస్తులను టైలర్ల సంఘాలకు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్లు రఫి తెలిపారు.

సారు రాకుంటే.. సెలవే

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అవస్థలు

న్యూస్‌టుడే, దుత్తలూరు

గత వైకాపా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ప్రాథమిక విద్య అగమ్యగోచరంగా మారింది. అనాలోచిత నిర్ణయంతో మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు రాకుంటే ఆ రోజు విద్యార్థులకు సెలవు ఇచ్చినట్లయింది. అసలే సర్కారు బడులకు ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతుంటే ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పరిస్థితి దారుణంగా ఉంది.

ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 357 ప్రాథమిక పాఠశాలలున్నాయి. 23,176 మంది విద్యార్థులున్నారు. వీటిల్లో 133 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండటం విశేషం. మూడు దశాబ్దాల కిందట ఈ తరహా విద్యాలయాలున్నాయి. ఒక ఉపాధ్యాయుడు అయిదు తరగతులకు బోధించడం కష్టమని గుర్తించిన నాటి తెలుగుదేశం ప్రభుత్వం 1996 సవరించి విద్యా హక్కు చట్టం ద్వారా అన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయుల విధానాన్ని అమలు చేశారు. తద్వారా ప్రాథమిక విద్యకు ప్రాధాన్యత కల్పించినట్లయింది. వైకాపా వచ్చిన తర్వాత ఈ విధానానికి స్వస్తి పలికింది.

ఏటా తగ్గుముఖం

ప్రస్తుతం గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రైవేటు పాఠశాలలపై ఆసక్తి పెరగడం, మరికొందరు ఇతర కారణాలతో పట్టణాలకు వలసలు వెళ్లడం తదితర కారణాలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. దీనికితోడు మూడు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధిస్తుండటంతో విద్యార్థులకు గుణాత్మక విద్య ఎంతవరకు అందుతుందనేది ప్రశ్నార్థకం. ఈ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన, మధ్య తరగతి వర్గాల పిల్లలు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు.



బోడవారిపల్లి పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయిని, పక్కన సీఆర్పీ

బోధనకు ఇబ్బంది

ప్రతి మండలంలోనూ 80 శాతం పాఠశాలల్లో ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉంటున్నారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలలో బోధకుడు సెలవు పెట్టాలంటే అక్కడికి డిప్యుటేషన్‌పై వెళ్లడానికి ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. సమీప పాఠశాలల నుంచి ఒకరిని డిప్యుటేషన్‌పై ఈ బదులుగా వచ్చినప్పుడు వారి పాఠశాలలో ఒకరే బోధించాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం గగనంగా మారింది.

నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	ప్రాథమిక	ఏకోపాధ్యాయ
దుత్తలూరు	42	20
సీతారామపురం	40	13
కొండాపురం	55	11
జలదంకి	46	20
వింజమూరు	40	12
వరికుంటపాడు	48	26
ఉదయగిరి	45	10
కలిగిరి	59	21

ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రతి మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న మాట వాస్తవమే. ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధించాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల్లో బోధన విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

– రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698 కందుకూరు: 70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: పోతురాలోని ఉత్తరం వైపు బజారులోని మురుగు కాలువ చెత్త, చెదారంతో అధ్వానంగా ఉంది. **- మాల్యాద్రి, స్థానికుడు**

సమాధానం: వర్షాలు తగ్గిన వెంటనే చర్యలు తీసుకుంటాం. **- అబ్దుల్ బారీ, పంచాయతీ కార్యదర్శి - వలేటివారిపాలెం, న్యూస్‌టుడే**

? స్థానిక బస్టాండ్ నుంచి పాత బ్యాంకు వరకు సిమెంటు రోడ్డుకిరువైపులా మురుగు నిల్వలతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **- కె.విశాల్, స్థానికుడు**

✓ పారిశుద్ధ్య కార్మికులకు తెలిపి కాలువలోని నీరు నిల్వలేకుండా చేస్తాం. **- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి - గుడ్లూరు**

? వెంగళాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలబడుతుంది. **- మాలకొండయ్య, గ్రామస్థుడు**

✓ గ్రామస్థుల సహకారంతో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. **- శివకుమార్, ఎంఈవో-2**

? లింగసముద్రం పెట్రోలు బంకు సమీపంలో ప్రధానో రోడ్డుపై వర్షపు నిల్వ ఉంటుంది. **- మహేష్, గ్రామస్థుడు**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **మాధవరావు, పంచాయతీ కార్యదర్శి - లింగసముద్రం**

నష్టపరిహారం చెల్లించాలి

గుడ్లూరు, న్యూస్‌టుడే: ఓడరేవు రహదారి కోసం భూములిచ్చిన దళితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు జి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చేవూరులో జరిగిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామాయపట్నం ఓడరేవు కోసం గ్రామంలో 15 ఎకరాల భూమిని 25 కుటుంబాల వారు ఇచ్చారన్నారు. కానీ అసైన్‌మెంట్ భూమి అంటూ పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. 2013 ఆర్ అండ్ ఆర్ చట్టం ప్రకారం అసైన్‌మెంటు అయినా సాగులో ఉంటే పరిహారం ఇవ్వాల్సిందేనన్నారు. పరిహారం ఇవ్వకపోతే నవంబరు ఒకటి నుంచి పోర్టు పనులను అడ్డుకుంటామన్నారు. ఇరువూరి బ్రహ్మయ్య, నూతలపాటి వెంకటేశ్వర్లు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు లీకు



కొండాపురం మండలంలోని కొమ్మి పంచాయతీ పరిధిలో ఉన్న గండికట్ల చెరువు కట్టకు శనివారం తెల్లవారుజామున లీకు ఏర్పడింది. సకాలంలో గుర్తించిన రైతులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. కంపచెట్లను తొలగించారు. ఇరిగేషన్ ఏఈ రమేష్ జేసీబీ యంత్రం తెప్పించి లీకును పూడ్చించారు. తాత్కాలికంగా రింగ్‌బండ్ ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కొండాపురం ఎస్సై వెంకట్రావు తదితరులు ఉన్నారు. **- న్యూస్‌టుడే, కొండాపురం**

వర్షానికి కూలిన పొగాకు బ్యారన్



దుత్తలూరు, న్యూస్‌టుడే : దుత్తలూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో శనివారం కురిసిన భారీ వర్షానికి ఒక పొగాకు బ్యారన్ పూర్తిగా కూలిపోయింది. గ్రామానికి చెందిన శిముని కృష్ణారెడ్డి అనే రైతుకు చెందిన పొగాకు బ్యారన్ వర్షానికి నానిపోవడంతో కుప్పకూలిపోయింది. సుమారు రూ. 5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. కలిగిరిలోని పొగాకు బోర్డు అధికారులు పరిశీలించారు.

కాలువ కాదిది.. రోడ్డే

పట్టణంలోని ఒకటో వార్డు జనార్దనకాలనీలోని పుట్ట ప్రాంతంలో అంతర్గత రోడ్డు కాలువను తలపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై భారీగా నీళ్లు నిలిచాయి. అంతర్గత సీసీరోడ్లు, కాలువలు లేకపోవడంతో మట్టి రోడ్డు పైనే నీళ్లు నిలిచాయి. స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.అనూష మాట్లాడుతూ కచ్చా కాలువలు తీయించి రోడ్డుపై నిలిచిన నీళ్లను వెంటనే వెళ్లగొట్టిస్తామన్నారు.



- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

నడకతో ఆరోగ్యం

కావలి : నడకతోనే ఆరోగ్యమని కావలి డీఎస్పీ ఎం.శ్రీధర్ అన్నారు. కావలి పట్టణంలో శనివారం నిర్వహించిన వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. నిర్వాహకురాలు ఖాదర్‌బీని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. స్వచ్ఛంద సేవకులు అలీం, బ్రహ్మయ్య, వినయకుమార్, పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కావలి, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు నాగలక్ష్మి అనే మహిళ చీటీపాటల వాయిదా సొమ్ము జాప్యం చేస్తుండటంతో నిర్వాహకురాలి నుంచి వేధింపులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తలకు వేసుకునే రంగును తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి ఆమెను కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

కుమార్తెను అరెస్టు చేస్తామంటూ.. బెదిరింపు వాట్సాప్ కాల్

ఉదయగిరి, న్యూస్‌టుడే: నేను పోలీసును మాట్లాడుతున్నాను.. మీ కుమార్తెను అరెస్టు చేసి దిల్లీకి తీసుకెళుతున్నామంటూ ఉదయగిరికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి బి.వెంకటేశ్వర్లుకు గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేసి బెదిరించిన సంఘటన శనివారం జరిగింది. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు. ..గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్‌లో పోలీసు డ్రస్‌లో ఉండే వ్యక్తి చిత్రాన్ని పెట్టుకుని ఫోన్ చేశారు. నీ పేరు వెంకటేశ్వర్లు కదా అని అడగటంతోపాటు కుమార్తె పేరు చెప్పాడు. హిందీలో మాట్లాడాలని అనడంతో వెంకటేశ్వర్లు తెలుగు మాట్లాడతానని చెప్పడంతో ఫోన్ కట్ చేశాడు. ఆ తరువాత వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లగా.. తన కుమార్తె ఇంటి వద్దే ఉంది. ఆమె సాయంతో సదరు వ్యక్తికి ఫోన్ చేసి హిందీలో మాట్లాడారు. 'నేను పోలీసును.. మీ కుమార్తెను అరెస్టుచేసి దిల్లీకి తీసుకెళుతున్నాం' అని గుర్తుతెలియని వ్యక్తి సమాధానమిచ్చాడు. కుమార్తె ఇంటి వద్దనే ఉండటంతో వెంకటేశ్వర్లు ధైర్యంగా తీసుకెళ్లు అంటూ మాట్లాడటంతో వెంటనే ఫోన్ కట్ చేశాడు. బెదిరింపు విషయంపై ఎస్సై ఇంద్రసేనారెడ్డికి ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

వర్ష బీభత్సం..



సీతారామపురంలో వాలిపోయిన వరి పైరు

సీతారామపురం, వింజమూరు, వరికుంటపాడు, జలదంకి, న్యూస్‌టుడే: ఉదయగిరి నియోజకవర్గం వ్యాప్తంగా శనివారం కురిసిన వర్షానికి పలు చోట్ల ఇళ్లన్నీ జలమయమయ్యాయి. పంటలు నేలవాలాయి. రాకపోకలు స్తంభించాయి. వాగులు పొంగి పొర్లాయి. సీతారామపురం మండలంలో ఈనెల14 నుంచి వరుసగా నాలుగురోజులు వర్షాలు కురవడంతో వరిపంట నేలవాలింది. అనంతరం శుక్రవారం ఎండకాయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. అధికారులు వాలిన వరిపైరును పరిశీలించి సూచనలు సైతం చేశారు. తిరిగి వర్షం కురవడంతో వాలిన వరికి తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వింజమూరులో శనివారం ఎనిమిది సెంటీమీటర్లకు పైగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమై కొన్ని చోట్ల ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. స్థానిక గంగమిట్ట కమ్మ బజారు, జీబీకేఆర్ గిరిజనకాలనీ, బీసీ కాలనీ, సుజాతనగర్, లక్ష్మీప్రియ, దేవతమహల్ కూడలి వద్ద ఇళ్లలోకి నీళ్లు చేరాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు నాలుగు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పలు కాలనీలలో పర్యటించారు. జీబీకేఆర్ గిరిజనకాలనీలో మధ్యాహ్నం కాలనీ వాసులకు భోజనం ఏర్పాటు చేశారు. వరికుంటపాడు మండలంలో భారీ వర్షం పడింది. మండలంలోని పిల్లాపేరు, ఉప్పువాగులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఎగువ ప్రాంతంలో పడిన వర్షంతో కనియంపాడు-రామదేవులపాడు మధ్యన పిల్లాపేరు వాగు రోడ్డుపై ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాల సమయంలో లోతట్టు వంతెనలు ఎక్కువగా ఉండటంతో రాకపోలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. జలదంకి మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. జమ్మలపాలెం వద్ద ఇసుక వాగు, జలదంకి చిప్పలేరు, ఉబ్బల వాగు ఉద్ధృతంగా ప్రవహించాయి. పలు చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరాయి.



వింజమూరులో ఇంటి ముందు చేరిన వర్షపు నీరు



పాతూరు చెరువు వంతెన వద్ద వాగుపై కొట్టుకుపోయిన రివిట్‌మెంట్



వరికుంటపాడు: వంతెనపై ప్రవహిస్తున్న పిల్లాపేరు వాగు

శిరస్త్రాణం తప్పనిసరి



కందుకూరులో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే : ప్రతి వాహనదారుడు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని కందుకూరు డీఎస్పీ సీహెచ్.వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పోలీసుస్టేషన్ నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సైలు సాంబశివయ్య, మహేంద్రనాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జలదంకి : కావలి, ఉదయగిరి జాతీయ రహదారిపై ఉన్న మలుపులు వద్ద వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని జలదంకి ఎస్సై సయ్యద్ లతీపున్నీసా సూచించారు. ఎస్పీ సూచనల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా శనివారం మండలంలోని కావలి, జలదంకి ర.భ శాఖ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి డ్రమ్ములు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఏఎస్సై హరిబాబు, పోలీసు సిబ్బంది సురేష్, వేణు,శ్రీనివాసులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలోని 565వ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా డ్రమ్ములను ఏర్పాటుచేశారు. ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి పేర్కొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య విచారణ

బిట్రగుంట, న్యూస్‌టుడే: వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మధ్య చోటు చేసుకున్న ఘటనలపై కలెక్టర్ సూచనల మేరకు బోగోలు పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పోలీసు బందోబస్తు మధ్య విచారణ చేపట్టారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఘటన ఇటీవల వివాదస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలువురు వార్డు సభ్యులపై కేసు నమోదైంది. తమపై కేసులు మోపడం సరికాదని న్యాయవిచారణ చేయించాలని వార్డు సభ్యులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు సర్పంచి పందిపాటి అనిత, పలువురు వార్డు సభ్యులు, ఈవో జహీర్‌లను విచారించారు. కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని వెల్లడించారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

లింగసముద్రం, వలేటివారి పాలెం, లింగసముద్రం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం చినపవని, పెదపవని, ముత్యాలపాడుల్లో పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. తెదేపా నాయకులు మనోహర్, సాంబయ్య, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు. మాలకొండలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాళ్లపాడు జలాశయాన్ని సందర్శించారు. ప్రాజెక్టులోకి ఏ మేర అడుగుల నీరు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న గ్రామస్థులు

కందుకూరు పట్టణం : విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు కందుకూరు మండలం మోపాడు గ్రామస్థులు శనివారం రూ.లక్ష నగదు చెక్కును ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేశారు. బాధితులను ఆదుకునేందుకు గ్రామస్థులంతా ముందుకు రావడం అభినందనీయమంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సిసింద్రీలు.. విజేతలు



తల్లితో చిన్నారులు

కావలి, న్యూస్‌టుడే: కావలి పట్టణం వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన సిద్ధార్థ మణికంఠ, రూపశ్రీ దంపతులకు తొమ్మిది నెలల కిందట కవలలు జన్మించారు. ఇంటిలో తోషణ్ కార్తీక్, తోషిణి కార్తీక్ ఉత్సాహంగా ఆడుకుంటారు. తల్లిదండ్రులు వారిని గత నెలలో విజయవాడ నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలకు తీసుకెళ్లారు. అక్కడ 'న్యూ ఇండియా బేబీ వన్ గేమ్స్' ఆధ్వర్యంలో ఆరు నెలల నుంచి సంవత్సరం లోపు వయసున్న చిన్నారుల్లో వీరు అరుదైన ప్రతిభ చూపారు. క్రాలింగ్ రేసు(పాకుతూ ముందుకెళ్లే పోటీ)లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఘనతను అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్సు కూడా ప్రత్యేకంగా ప్రశంసించింది. సాఫ్ట్‌వేర్‌లో రాణిస్తున్న ఆ యువ దంపతులు భిన్నంగా ఆలోచిస్తూ విజయవాడలో పోటీ సంగతి తెలియగానే అక్కడకు తీసుకెళ్లి తమ శిశువులను పాల్గొనేలా చేశారు. ప్రస్తుత ప్రపంచం అంతా పోటీతత్వంతోనే ఉన్నందున ఊహ తెలియని వయసు నుంచే వారిలో అలవాటు పెంపొందించాలనే ధ్యేయంతోనే ఒలింపిక్స్ పోటీలకు తీసుకెళ్లినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలి

కందుకూరు పట్టణం : ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి ఆరు రోజులు పాటు నిర్వహించనున్న రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలని బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.మోహన్ రావు, కందుకూరు డివిజన్ అధ్యక్షుడు షేక్‌అబ్దుల్లా శనివారం ఓ ప్రకటనలో కోరారు. వృత్యంతర శిక్షణ పేరుతో మూడు జిల్లాలకు కలిపి సుదూర ప్రాంతంలో రెసిడెన్షియల్ శిక్షణను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. వయసు రీత్యా, ఆరోగ్య రీత్యా ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలుగుతాయని, కావున డివిజన్ కేంద్రాల్లో శిక్షణ ఇప్పించాలని కోరారు.

పురపాలకం.. పారిశుద్ధ్యం అధ్వానం



కావలి విట్స్ కళాశాల సమీపంలో చెత్తాచెదారం

కావలి, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వర్షాల అనంతరం ఏర్పడ్డ సమస్యలు ఇంకా కొలిక్కి రాలేదు. చెత్తాచెదారాలు ఎక్కడ పడితే అక్కడ కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానికులకు ఇక్కట్లు తప్పడం లేదు. పారిశుద్ధ్య పరిస్థితులు సరిలేకపోవడంతో దోమల బెడద తీవ్రతరమవుతోంది. చాలాచోట్ల మురుగు కాలువలు అధ్వానంగా ఉండడంతో వాన నీటితో కలిసి రోడ్డుపైకి చేరుతుంది. ఈ పరిస్థితి వైకుంఠపురంలోని అనపగుంత వద్ద చాలా ఎక్కువగా ఉంటోంది. మరో పక్క పందుల బెడద కూడా ఎక్కువగానే ఉంటోంది.

అంతంతమాత్రంగానే..

కావలి పురపాలక సంఘ పరిధిలో 40 వార్డులు ఉన్నాయి. అంతంతమాత్రంగా ఉండే పారిశుద్ధ్యం భారీవర్షాలతో దయనీయంగా మారింది. సిబ్బంది తక్కువ కావడంతో చెత్తాచెదారాలను నిర్దిష్ట డంపింగ్‌యార్డుకే తరలించలేక ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సిబ్బంది మధ్య చాన్నాళ్లగా విభేదాలుండటం కూడా ఇప్పటి ఇబ్బందులకు కారణమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలువలు పూడికతో నిండిపోయాయి. ఫాగింగ్ చేపట్టడం లేదు. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతుండడంతో వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు శ్రద్ధ వహించి.. చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పురపాలక పరిధిలో..

- మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది 360
- పొరుగు సేవల సిబ్బంది – 256
- దినసరి వేతనాల కార్మికులు – 70
- శాశ్వత ప్రాతిపదికన – 34
- నిత్యం వచ్చే చెత్తాచెదారాలు– 51 టన్నులు
- చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్న ట్రాక్టర్లు 9

చర్యలు తీసుకుంటున్నాం

ఎక్కడా పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తున్నాం. ఫాగింగ్ వాహనాలను ముమ్మరంగా నడుపుతాం. మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

సాయిరాం, జి.శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం

కోవూరు

● కోవూరు ● సర్వేపల్లి ● ఆత్మకూరు


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మకు ప్రసాదం అందజేస్తున్న అధికారులు

కామాక్షితాయి సేవలో ఉషమ్మ

బుచ్చిరెడ్డిపాలెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారిని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మతో పాటు పలువురు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందించారు.

ప్రయాణికులకు బహుమతులు అందజేత

బుచ్చి, నెల్లూరు (రవాణా), న్యూస్‌టుడే: ప్రయాణికులను ఆకర్షించేందుకు నెల్లూరు ఒకటో డిపో పరిధిలో నడిచే నెల్లూరు- బుచ్చిరెడ్డిపాళెం సర్వీసులో ప్రయాణించే వారిలో నెలలో రెండు సార్లు లక్కీడిప్ ద్వారా ముగ్గురికి బహుమతులు అందజేస్తున్నారు. ఈ నెల 16వ తేదీ ఎంపికైన ముగ్గురికి డిపో మేనేజర్ మురళీకృష్ణ శనివారం నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండులో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజేతలు జి.ప్రహర్షిణి, హెచ్.వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : బుచ్చిలోని శేషాద్రినగర్‌లో పందులు సంచరిస్తున్నాయి. **- మాల్యాద్రి, స్థానికుడు**

? బుచ్చిలోని కాశీపాళెం వద్ద పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. **- రవీంద్ర**

సమాధానం: సిబ్బందికి చెప్పి సమస్యలు పరిష్కరిస్తాం **- చంద్రశేఖర్‌రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్**

? ముత్తుకూరు మండలం ముసునూరువారిపాళెంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో బయటకు రావాలంటే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.? **- శ్రీనివాసులు, స్థానికులు**

✓ పంచాయతీ కార్యదర్శిని పంపి వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- నాగమణి, ఎంపీడీవో**

? విడవలూరు మండలం అలగానిపాడులో వర్షాలకు మురుగు కాలువల్లో మురుగు చేరి దోమలు బెడద అధికంగా ఉంది. మురుగు నిల్వ లేకుండా చూడాలి. **- గ్రామస్థులు, అలగానిపాడు**

✓ పరిశీలించి దోమల నివారణ చర్యలు చేపడతాం. **- మస్తాన్‌ఖాన్, ఈవోపీఆర్డీ**




విరిసిన ప్రతిభ

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా అంతర్జాల వినియోగం వల్ల కలిగే లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. జి.తేజశ్రీ (ప్రథమ), పీవీ హేమశృతి(ద్వితీయ), సీహెచ్ హర్షిత(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి బహుమతులు అందచేశారు. ఉపాధ్యాయులు మధు, కిషోర్, ప్రసాద్, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

రాపూరు : మండలంలోని పెంచలకోన ఆలయ శాశ్వత నిత్యాన్నదాన సత్ర నిర్వహణకు నెల్లూరుకు చెందిన పెంచలయ్య జ్ఞాపకార్థం భార్య రాజేశ్వరి, కుమారులు ప్రదీప్, సుధీర్ కలిసి శనివారం రూ.50 వేల విరాళాన్ని ఆలయ అధికారి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.

చేపల వేటతో చెరువులు ఖాళీ!

నీటి వృథాను పట్టించుకోని అధికారులు


ఈ చిత్రంలో కనిపిస్తోంది కొలనుకుదురు గ్రామంలోని చెరువు. ఎప్పుడూ జలకళతో ఉండేది. గ్రామ అవసరాలకు నీటిని వినియోగించుకునే వారు. ప్రస్తుతం చేపల వేలం దారులు చెరువులో ఉన్న నీటిని మోటార్లతో తోడేయడంతో నీరు పూర్తిగా అడుగంటింది.

న్యూస్‌టుడే, మనుబోలు

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల పరిధిలోని పలు చెరువుల్లో చేపల వేలం దక్కించుకున్న వారు నీటిని వృథా చేస్తున్నారు. సాగు నీటితో జలకళను సంతరించుకోవాల్సిన చెరువులు అధికారుల నిర్లక్ష్యంతో అడుగంటుతున్నాయి. మెట్ట ప్రాంతాల్లో ఆశించిన వర్షాలు లేక చెరువులు వెలవెలబోతున్నాయి. మేజర్ పంచాయతీ మనుబోలులో మాత్రం చెరువులో ఉన్న నీటిని తూముల ద్వారా పంట కాలువల్లో వదిలేస్తున్నారు. పంచాయతీ అధికారులు నిర్వహించే చేపల వేలం దక్కించుకున్న పలువురు ఆదాయం కోసం పూర్తి స్థాయిలో నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఈ క్రమంలో సాగుదారులకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. చివరి ఆయకట్టుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపల పట్టేందుకు వృథాగా చేయడంతో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కండలేరు ఆయకట్టు పరిధిలో ఉన్న పలు చెరువుల్లో ఇదే పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న సమయంలో చెరువులో నీరు వృథా చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


మనుబోలు చెరువులో తగ్గుముఖం పట్టిన నీరు

నిబంధనలిలా..

- చెరువుల్లో ఎలాంటి వ్యర్థాలు, రసాయనాలు వేసి కలుషితం చేయకూడదు. ఎట్టి పరిస్థితుల్లో నీటిని తూముల నుంచి విడుదల చేయకూడదు. ప్రత్యేకంగా చేపల పెంపకం చేయకూడదు.
- చేపల వేలం దక్కించుకున్న వారు చేపలు పట్టే సమయంలో పంచాయతీ అధికారులకు సమాచారమివ్వాలి.
- నీరు వృథా చేయకుండా నీటిపారుదల అధికారులు పర్యవేక్షించాలి.

చర్యలు తీసుకుంటాం

వేమారెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ

చెరువుల్లో ఉన్న నీటి చేపలు పట్టేందుకు వృథా వదిలేస్తే చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితుల్లో చెరువుల్లోని నీటి వృథా చేయకుండా చర్యలు చేపడతాం.

పునరావృతమైతే చర్యలు

సంగం, న్యూస్‌టుడే: గాంధీజనసంఘం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన తయారీ కట్టెల పొయ్యిపై చేస్తుండగా డిప్యూటీ డీఈవో గోపాల్ అసహనం వ్యక్తం చేశారు. గ్యాస్‌తో చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎందుకు చేస్తారంటూ మధ్యాహ్నభోజన తయారీ నిర్వాహకులను నిలదీశారు. మరోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



వ్యాధులు ప్రబలుతున్నా నిర్లక్ష్యమేనా..

పొదలకూరు పంచాయతీ కార్యాలయ భవనం మార్చడంతో వివాదం నెలకొంది. ఈ క్రమంలో నూతన కార్యాలయానికి తాళాలు వేశారు. పారిశుద్ధ్య పనికరాలున్న భవనంలోనే ఉన్నాయి. పది రోజులు గడిచినా తలుపులు తెరచుకోలేదు. ఇటీవల వర్షాలు కురవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి చేరింది. సైడు కాలువలు శుభ్రం చేయకపోవడం, చెత్త పేరుకుపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాన్ని పాత భవనంలోకి మారుస్తామన్నారు. రెండు రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు, బుచ్చి



పట్టించుకునేదెవరు

విడవలూరు మండలం రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని వెంకటనారాయణపురం వద్ద రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడింది. ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు గండి వద్ద ప్రమాద సూచికగా కర్ర పెట్టారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బి అధికారుల వివరణకు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

– న్యూస్‌టుడే, బుచ్చి, విడవలూరు.



ఇసుక సేకరణ ప్రారంభం

సంగం ఆనకట్ట ఎగువ భాగంలో పెన్నానదిలో పడవల ద్వారా పూడిక తొలగింపు, ఇసుక సేకరణ శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ ప్రక్రియ సెప్టెంబరు నెల నుంచి జరుగుతుండగా, అక్కడ సేకరించిన ఇసుకను నిల్వ చేసుకునేందుకు స్థలం లేక వారంరోజులుగా ఆగింది. నిల్వ కేంద్రంలోని ఇసుక వివిధ ప్రాంతాలకు తరలించడంతో అక్కడ స్థలం లభించడంతో తిరిగి పనులు ప్రారంభించారు. – న్యూస్‌టుడే, సంగం

దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

పొదలకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం డైస్లెక్సియా వాక్‌పై ప్రత్యేక అవసరాల పిల్లలకు నడకపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్ మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన, అంగ వైకల్యంలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణలో భాగంగా ఐఈడీ పాఠాలు ఆదరించాలన్నారు. అవగాహన కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఆత్మకూరు పట్టణంలో వెస్ట్ ప్రాథమిక పాఠశాల బాలిక కేంద్రం నుంచి పురపాలక సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. – న్యూస్‌టుడే, పొదలకూరు, ఆత్మకూరు



గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట

మర్రిపాడు, న్యూస్‌టుడే: మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మర్రిపాడు మండల కూటమి పార్టీ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

పొదలకూరు, న్యూస్‌టుడే : వ్యవసాయంలో సాంకేతిక మెలకువలు తెలుసుకొని రైతుల సాగులో సలహాలు సూచనలివ్వాలని పొదలకూరు ఏడీఏ శివనాయక్ అన్నారు. శనివారం పొదలకూరు చిరుధాన్య పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు, మనుబోలు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వీఏవోలు, ఏఈవోలతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో అన్ని పంటల సాగుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు ప్రసన్న రాజేష్, శాస్త్రవేత్త సురేఖాదేవి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరులో 566 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

కొడవలూరు : కొడవలూరులో విజిలెన్స్ అధికారులు ఒక గ్యాస్ ఏజెన్సీపై ఆకస్మిక దాడులు చేసి భారీగా సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఏఎస్‌వో, సీఐ శ్రీహరిరావు, తహసీల్దారు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ల గోదాములను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోవడం, తదితర కారణాలతో 566 గ్యాస్ సిలిండర్లు అక్రమంగా ఉన్నాయని సీజ్‌చేశారు. 6ఏ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.


గోదామును పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిలో క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత పరీక్షలు

బుచ్చిరెడ్డిపాళెం : వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా 21 నుంచి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు బుచ్చిలో జరుగుతాయని కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతి రెడ్డి తెలిపారు. బుచ్చి మండలం పెనుబల్లిలో శనివారం పల్లె పండగ కార్యక్రమంలో రూ.5.80 లక్షల విలువైన అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించారు.

ఇసుక కష్టాలకు చెల్లు


న్యూస్‌టుడే, కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం

రీచ్‌లో ఇసుక తీసుకెళుతున్న ట్రాక్టరు

వైకాపా అయిదేళ్ల పాలనలో నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొట్టారు.. పెన్నానదిలో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి అప్పటి ఎమ్మెల్యే అనుచరులు దోపిడీకి పాల్పడ్డారు.. బుచ్చి, కొడవలూరు మండలాల్లో ఇసుక, మట్టి తవ్వకాలతో కోట్ల రూపాయలు అక్రమార్జనతో ఎవరైనా ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు దిగారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల ఇబ్బందులను గమనించి ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చింది. స్థానికంగా ఏర్పడిన కొన్ని సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలు కోరుకునే విధంగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో నదులు, వాగుల నుంచి ఇసుక తీసుకెళ్లొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణ రంగానికి జవసత్వాలు..

ఇసుక తక్కువ ధరకు, అందుబాటులో ఉంటే నిర్మాణ రంగం జోరందుకుంటుంది. నదిలో ఇసుక తవ్వే కూలీల నుంచి, నిర్మాణ కార్మికులు, సెంట్రింగ్, వైరింగ్, ప్లంబింగ్, టైల్స్, ఇతర గృహ పరికరాల పనులు చేసే వారందరికి ఉపాధి లభిస్తుంది. అసంఘటిత కార్మిక వ్యవస్థ ఎక్కువగా ఇసుకపై ఆధారపడి ఉంది. అయిదేళ్ల వైకాపా పాలనలో ట్రాక్టర్ పదిహేను వందల రూపాయలకు లభించే ఇసుకను అయిదు వేల రూపాయలకు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నికల అనంతరం ఉచిత ఇసుక విధానం అమలు చేయడంతో పాటు సీనరేజి రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం రీచ్‌లకు అనుమతులిచ్చి టెండర్లు పిలిచింది. తాజాగా వారు సిండికేట్ అవడంతో రద్దు చేసింది. రీచ్‌లకు అనుమతిస్తే నిర్వాహకులు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకెళితే అడ్డుకునే అవకాశముంది. ప్రభుత్వ ప్రకటన దృష్టిలో ఉంచుకొని అధికారులు పేదలకు సులువుగా ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి

విడవలూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. విడవలూరులోని ఇందిరమ్మ కాలనీ, వావిళ్లలో పల్లె పండగ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆమె రూ.20 లక్షలతో సీసీ రోడ్ల పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మండలంలో రూ.82 లక్షలతో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు శ్రీకారం చుట్టామన్నారు. వర్షాలకు రోడ్లు, కాలువలకు గండ్లు పడకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కాలువల పూడికతీత కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. నాయకులు చెముకుల శ్రీనివాసులు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, అడపాల శ్రీధర్‌రెడ్డి, ఆవుల వాసు, ఏటూరి హరిరెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, సత్యం రెడ్డి, జనసేన, భాజపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


విడవలూరులో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

జమిలీ ఎన్నికలను వ్యతిరేకించాలి

అనంతసాగరం : కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందని, ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఆమనిచిరివేళ్ల గ్రామంలో సీపీఎం మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఏర్పాటు చేసిన అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పందులను దూరంగా తరలించండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పందులను పట్టణంలో సంచరించకుండా, దూరప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. శనివారం కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది పందుల పెంపకం దారులతో మాట్లాడారు. పందులను పట్టణానికి దూరంగా తరలించి పెంచుకోవాలని సూచించారు.

మత్స్యకార సొసైటీలో అవకతవకలపై చర్యలు తీసుకుంటాం

మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని పిడూరుపాలెం మత్స్యకార సొసైటీలో జరిగిన అవకతవకలపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఏడీ రంగనాథబాబు తెలిపారు. శనివారం పిడూరుపాలెం గ్రామానికి వెళ్లి విచారించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకార సొసైటీలో ఓసీలకు సభ్యత్వం కల్పించడమే కాకుండా వారికి పింఛన్ ఇస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేశామన్నారు. బద్దెవోలు రెవెన్యూ పరిధిలో రైతు వేసిన చేపల గుంత కారణంగా తమ పైర్లు దెబ్బతింటున్నాయని పిడూరుపాలెం రైతులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దారు సుబ్బయ్యతో కలిసి పరిశీలించామన్నారు.

పెన్నా నదిలో పడి యువకుడి మృతి

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పెన్నా నది ఒడ్డున బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు పడి ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని పల్లిపాడులో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు... పల్లిపాడుకు చెందిన రమేశ్(48) గురువారం బహిర్భూమికి పెన్నానది ఒడ్డు వద్దకెళ్లారు. ప్రమాదవశాత్తు నదిలో పడిపోయారు. బంధువులు, పోలీసులు గాలించగా శనివారం మృతదేహం గుర్తించారు. పంచనామా నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హౌసింగ్ ఏఈ పర్సు చోరీ

మనుబోలు, న్యూస్‌టుడే: మనుబోలు గృహనిర్మాణశాఖ ఏఈగా పనిచేస్తున్న భాస్కర్‌రావు పర్సు చోరీకి గురైంది. నెల్లూరులో బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చేతివాటం ప్రదర్శించి ఏఈ జేబులో ఉన్న పర్సును అపహరించారు. ఏఈ మాట్లాడుతూ.. రూ.500 నగదు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు ఉన్నాయన్నారు. బస్సు ఎక్కుతున్న సమయంలో ఇద్దరు వెంటపడ్డారని పేర్కొన్నారు.

మళ్లీ వర్షం.. రైతుల అవస్థలు

చేజర్ల, న్యూస్‌టుడే: భారీవర్షం నుంచి కోలుకొని వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు శనివారం ఉదయం మళ్లీ మొదలైన వర్షం ఇబ్బందులకు గురిచేసింది. వరి కోతలకు, మెట్ట పైర్లలో సస్యరక్షణ పనులకు ఆటంకం కలిగించింది. వర్షం కారణంగా బురద పెరిగి పంట కోత ఖర్చులు రెట్టింపయ్యాయి. ధాన్యం దిగుబడి తగ్గింది. అధిక తేమ శాతం ఉన్న కారణంగా ధరల్లోనూ కోత పడింది.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి మృతికి సంతాపం



రాపూరు : రాపూరు సమితి మాజీ అధ్యక్షులు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి(81) హైదరాబాద్‌లో శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ప్రజల సందర్శనార్థం ఆదివారం నెల్లూరులో ఉంచి 21న స్వగ్రామమైన వేపినాపిలో అంత్యక్రియలు జరగనున్నట్లు బంధువులు పేర్కొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి

సైదాపురం, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని సైదాపురం మండలాధ్యక్షురాలు పెంచలమ్మ సూచించారు. మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులు సభలో వివరించారు. మండలానికి మంజూరైన వివిధ రకాల నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని గ్రామాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీవో శివకుమార్ వివరించారు.

శ్మశాన స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

కలువాయి : మండలంలోని తోపుగుంట సచివాలయ పరిధిలో శనివారం తహసీల్దార్ శ్యాంసుందరరాజు ఆధ్వర్యంలో రీసర్వేపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తెదేపా నాయకుడు చంద్రమౌళి గ్రామంలో శ్మశాన స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాయితీల సద్వినియోగంపై అవగాహన

సైదాపురం, న్యూస్‌టుడే: రైతుల కోసం ఉద్యాన, వ్యవసాయశాఖల ద్వారా అందించే వివిధ రకాల రాయితీలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి సూచించారు. పాలూరులో శనివారం పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అందించే వివిధ రాయితీలపై అన్నదాతలకు వివరించారు.

సర్వేపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తోటపల్లిగూడూరు మండలం కొత్తపాలెం పంచాయతీలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, చేవూరు శ్రీనివాసులు, బొబ్బేపల్లి సురేష్ పాల్గొన్నారు.

ఎడ్లబండ్లపై ఇసుక తరలిస్తుండగా వివాదం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పెన్నానదిలో ఎడ్ల బండ్లపై ఇసుక తీసుకెళుతున్న వారిపై స్థానికంగా ఒక వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన శనివారం ముదివర్తిపాలెంలో జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు గంగపట్నం గ్రామానికి చెందిన ఓసూరు సూరిబాబు, అలీ మరో వ్యక్తి పెన్నానదిలో ఎడ్లబండ్ల ద్వారా ఇసుక తరలిస్తున్న సమయంలో ముదివర్తిపాలెం చెందిన పక్కపాటి నాగరాజు అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా బండ్లలోని ఇసుక కింద తోసేసి వారిపై దాడికి పాల్పడటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెదేపా నాయకుడిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

కోవూరు, న్యూస్‌టుడే: మండలంలోని పడుగుపాడుకు చెందిన తెదేపా నాయకుడు మహేశ్‌రెడ్డిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో, రాడ్లతో దాడికి పాల్పడినట్లు బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.... పడుగుపాడు గ్రామానికి చెందిన మహేశ్‌రెడ్డి శుక్రవారం రాత్రి మినీబైపాస్‌లోని తన వాటర్ ప్లాంట్ మూసేసి ఇంటికొస్తుండగా గుర్తుతెలియని అయిదుగురు వ్యక్తులు ముఖానికి ముసుగులు వేసుకొచ్చి కర్రలతో, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. తలకు తీవ్ర గాయమవగా కుడిచేయి, కాలు విరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్‌రెడ్డి

పొదుపు బాట.. ప్రగతికి బాసట

న్యూస్‌టుడే, సైదాపురం, ముత్తుకూరు

గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పొదుపు సంఘాల్లో చేరి విభిన్న రంగాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారు. సమాఖ్యల ద్వారా రుణాలు పొంది సద్వినియోగం చేసుకొని ఆదాయాన్ని వృద్ధి చేసుకుంటున్నారు.. సైదాపురం మండలంలోని వైడీపీ(యానాది అభివృద్ధి సమాఖ్య)లో దాదాపు 106 సంఘాలు ఉండగా దాదాపు 1049 మంది సభ్యులున్నారు. సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు వివిధ దుకాణాలు ఏర్పాటు చేసి కుటుంబానికి తన వంతు సహకారమందిస్తూ ప్రగతి బాట సాధిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లో పొదుపులో చేరి అభివృద్ధి పథంలో పయనిస్తున్నారు. చాగణంరాజుపాళెం గ్రామానికి చెందిన అరుణమ్మ మాట్లాడుతూ వైడీపీలో చేరి రుణం తీసుకోవడంతో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నానని, కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.

రుణ పరిమితి పెంచాలి


పద్మమ్మ, సమాఖ్య అధ్యక్షురాలు

రూ.50 వేల లోపు మాత్రమే సభ్యులకు రుణాలు ఇస్తున్నారు. చిన్నపాటి వ్యాపారానికి సరిపోవడం లేదు. రుణ పరిమితి రూ.రెండు లక్షల వరకు ఇవ్వాలని ప్రతిపాదించాం. జిల్లా సమావేశాల్లో ఉన్నతాధికారులను కోరాం. రుణ పరిమితి పెంచితే మహిళలకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

కుటుంబానికి సహకారం


శంకరమ్మ, చాగణం రాజుపాళెం

గతంలో బయట రుణం తీసుకోవాలంటే పలు ఇబ్బందులు ఎదుర్కొన్నా. సమాఖ్యలో సభ్యురాలిగా చేరి రూ.50 వేల రుణం తీసుకొని బర్రెలు కొనుగోలు చేశా. పాల విక్రయాల ద్వారా రుణాన్ని తిరిగి చెల్లించా. కుటుంబ అవసరాలకు నావంతు సహకారమందిస్తున్నా.

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

సమస్య: జడ్జీ కాలనీలో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – అనిత

సమాధానం: కాలువల్లో పూడిక తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? టైలర్స్ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. – షబ్బీర్

✓ కుక్కలను పట్టివేయిస్తాం.. చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: మైపాడు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున ఆదివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏసీ కూరగాయల మార్కెట్, వీఆర్సీ సెంటర్, వాకిలి వీధి, ఆచారి వీధి, కాంప్లెక్స్ రోడ్డు, పొగతోట పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

డిప్యూటీ సిటీప్లానర్ పద్మజ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ డిప్యూటీ సిటీప్లానర్‌గా పద్మజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జాయినింగ్ రిపోర్టును పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు అందించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా గ్రేటర్ విశాఖ డీసీపీగా పని చేస్తున్న ఆమెను ఇక్కడ నియమించారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన డీఆర్డీఏ పీడీ

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి శనివారం కలిశారు. ఇటీవల పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె చైర్‌పర్సన్‌ను కలిసి పుష్పగుచ్ఛమిచ్చారు. పలు అంశాలపై చర్చించారు.

మారని కాలనీలు.. తీరని కష్టాలు

న్యూస్‌టుడే, నెల్లూరు(దర్గామిట్ట)

నగరంలోని పలు కాలనీల్లో సమస్యలతో ప్రజలు నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నారు. నడిబొడ్డులో ఉన్న వాటిలోనూ సౌకర్యాలు లేక ప్రజలు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కాకుండా ఉన్నాయి. ఫత్తేఖాన్‌పేట, మూలాపేట మధ్య పాత పోలీసు కాలనీ ఉంది. ఇక్కడి నుంచి మూలాపేటకు వెళ్లేందుకు మార్గం ఉంది. ఇది గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఈప్రాంతంలోని వివిధ ఆలయాలకు ఇటే వెళ్లాలి. రామయ్య బడికి విద్యార్థులు కూడా ఈమార్గంలోనే వెళుతుంటారు.



శిథిలమైన ఇళ్లు

గుంతల్లో నీటితో ప్రమాదాలు

ప్రధాన రోడ్డులో పడిన గుంతల్లో నిత్యం నీరు నిలిచిపోతుంది. వీటి లోతు తెలియక ద్విచక్ర వాహన చోదకులు పడి గాయపడుతున్నారు. రాత్రిళ్లు పాదచారులకు కూడా అవస్థలు తప్పడం లేదు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

ఈప్రాంతంలో పారిశుద్ధ్యం కూడా అధ్వానంగా తయారైంది. రోడ్లపై చెత్త పేరుకుపోయింది. మురుగుకాలువలు పూడికతో నిండిపోయాయి. వీటిని



రోడ్డు పక్క చేరిన మురుగునీరు

ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై స్థానిక పారిశుద్ధ్య అధికారి చంద్ర మాట్లాడుతూ అయిదేళ్లుగా పోలీసు కాలనీలో గేట్లు మూసివేశారన్నారు. ఇళ్లన్నీ శిథిలమయ్యాయన్నారు. ఈ ప్రాంతం మా పరిధిలోకి రాదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ప్రతిభకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, జ్ఞాపకశక్తితో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. నగరంలోని మైథిలీ పాఠశాలలో వీటిని ఏర్పాటుచేశారు. 'అంతర్జాల వినియోగం - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల పాత్ర' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఇవి జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి స్థానంలో బి.సాయిదక్షిత్, ద్వితీయ స్థానంలో పి.మోహిత్, తృతీయ స్థానంలో బి.సూర్య నిలిచారు. వీరికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మైథిలి, అకడమిక్ డైరెక్టర్ సత్యప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

రహదారి ఛిద్రం.. రాకపోకలకు కష్టం



ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో రహదారులు ఛిద్రమయ్యాయి. చంద్రబాబునగర్ నుంచి పోలీసు కాలనీకి వెళ్లే దారి మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షానికి కొట్టుకుపోయి గోతులు పడింది. ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - ఈనాడు, నెల్లూరు

అసలే ఇరుకు.. ఆపై ఎదురు ప్రయాణం

నెల్లూరు శివారు బుజబుజనెల్లూరు వెళ్లే చెముడుగుంట పంచాయతీ పరిధి పవన్ కాలనీ వద్ద జాతీయ రహదారిపై ఉన్న వంతెన దగ్గర ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ ఇరుకుగా ఉంది. వాహనాలు వేగంగా వస్తుంటాయి. అయినా కొందరు వాహనాలను ఎదురుగా వస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి. దీన్ని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. -ఈనాడు, నెల్లూరు



ఇది జాతీయ రహదారేనా?



నగర శివారులోని బుజబుజనెల్లూరులో జాతీయ రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని కంకర బయటపడింది. వీటి కారణంగా అదుపు తప్పి ద్విచక్ర వాహనచోదకులు పడి గాయపడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉండే దీనికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. మరమ్మతులు చేయిస్తామని అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

నిలిచిన నీరు.. ప్రజలకు ఇక్కట్లు



నగరంలోని నిప్పో సెంటరు సాయిబాబా గుడి వద్ద కాలువ పూడికతో నిండిపోయింది. దీన్ని తీయకపోవడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేక జీఎన్‌టీ రోడ్డుపై నిలిచిపోయింది. ఈ నీటితో పాదచారులు, వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. కాలువలో పూడిక తీయించి నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (పొదలకూరు రోడ్డు)

ఖాళీ కొబ్బరి బోండాలు.. వ్యాధి కారకాలు



బుజబుజనెల్లూరు ప్రాంతంలో పెద్దఎత్తున ఖాళీ కొబ్బరి బోండాలను చిరువ్యాపారులు పడేశారు. వర్షాలకు వీటిలో నీరు చేరుతోంది. డెంగీ దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఖాళీ స్థలంలో ఉన్న వాటిని తొలగిస్తామని నగరపాలకసంస్థ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

సీనరేజ్ రద్దుతో ఒరిగేదేమీ లేదు: కాకాణి

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని విధంగా ఇసుక ధర వేలల్లో ఉండగా.. సీనరేజ్ రద్దుతో పదుల్లోనే ఊరట కలుగుతుందని వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక, మద్యం విషయాల్లో జోక్యం చేసుకుంటే సహించనని చంద్రబాబు తన సొంత పార్టీ నేతలకు జారీ చేస్తున్న హెచ్చరికల్లో చిత్తశుద్ధి ఉంటే ఇప్పటివరకు బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు, బ్లాక్‌మెయిల్ చేసిన ఎమ్మెల్యేలు, మంత్రులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని ప్రశ్నించారు. జిల్లాలోని సూరాయపాలెం ఇసుక రీచ్‌లో ఇసుక దోపిడీకి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్కెచ్ వేశారని ఆరోపించారు. ఇసుక రీచ్‌లకు దాఖలైన టెండర్ల నుంచి లాటరీ ద్వారా కాంట్రాక్ట్ ఖరారు చేయాలన్న నిబంధనను కలెక్టర్ బేఖాతర్ చేస్తూ ఎమ్మెల్యేల అనుచరులకు తిరిగి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటిపై ఈనెల 25న ధర్నా చేస్తామని ప్రకటించారు.

రైలు కింద పడి ఆత్మహత్య

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్ వద్ద చోటుచేసుకుంది. ఆధారాలు లభ్యం కాలేదు. అతనికి 40 నుంచి 45 మధ్య వయసు ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. నలుపు, తెలుపు, పసుపు రంగు డిజైన్ గల ఫుల్ హ్యాండ్స్ టీ షర్ట్, పచ్చ రంగుపై డిజైన్ షార్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ..

నెల్లూరు (నేర విభాగం) : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట చాకలి వీధిలో ఉంటున్న విజయ్‌కుమార్ (54) ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నెల 15న ఆయన ఇంట్లో కళ్లు తిరిగి కింద పడి గాయపడ్డారు. ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎం-1 సినిమాస్- స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. వేట్టయాన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. వేట్టయాన్, స్క్రీన్2.. జనక ఐతే గనక, స్క్రీన్3.. ది వైల్డ్ రోబోట్, స్క్రీన్4.. విశ్వం, స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1.. దేవర, దివైల్డ్ రోబోట్, విశ్వం, స్క్రీన్2.. విశ్వం, దేవర, స్క్రీన్3.. వేట్టయాన్, స్క్రీన్4.. విశ్వం, లవ్‌రెడ్డి, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1.. దేవర, స్క్రీన్2.. వేట్టయాన్, విశ్వం స్క్రీన్3.. విశ్వం, వేట్టయాన్, స్క్రీన్4.. జనక అయితే గనక

నరసింహస్వామి సేవలో వెంకయ్యనాయుడు సతీమణి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నగర శివారులోని నరసింహకొండ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి, అమ్మవార్లను మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ శనివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, మురళీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ఉషమ్మ, తదితరులు

ఆక్రమణల తొలగింపు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఎట్టకేలకు నగరంలో ఆక్రమణలు తొలగించేందుకు పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం 54వ డివిజన్ వెంకటేశ్వరపురంలో గొర్రెల గంజిఖానా వద్ద కబ్జాలను తొలగించారు.

వ్యభిచార గృహ నిర్వాహకుల అరెస్టు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: వ్యభిచారం గృహ నిర్వాహకులను పటాన్‌చెరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన సాయికృష్ణారెడ్డి, నాగేశ్వరరావు పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. కోల్‌కతాకు చెందిన మున్నా ద్వారా యువతులను పిలిపించి అమీన్‌పూర్, చిట్కుల్ ప్రాంతంలో ఇళ్లు అద్దెకు తీసుకుని విటులను పిలిపించి వ్యభిచారం చేయిస్తున్నారు. గతంలో 2023లో జులై 22న వ్యభిచారం గృహంపై దాడిచేయగా నిందితులిద్దరూ పరారయ్యారు. మళ్లీ చిట్కుల్ గ్రామంలో ఇదే తతంగం నిర్వహిస్తున్నారని తెలిసి పక్కా ప్రణాళిక ప్రకారం దాడి చేసి నిందుతులు సాయిక్రిష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో ఇద్దరు దొంగలు

రాయచోటి, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో ఈ ఏడాది జూన్ 30న జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. లక్ష్మీపురంలో జరిగిన వరుస చోరీలపై అప్పట్లో కేసు నమోదు చేసి దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం గాలివీడు రింగ్‌రోడ్డు వద్ద సంచరిస్తున్న నెల్లూరు పట్టణానికి చెందిన లింగుటేరి రాంబాబు, కావలికి చెందిన నడింపల్లి గోఎని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ.ఆరు లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన వారిపై నెల్లూరు, కావలి, కనిగిరి, వేదాయపాలెం, యలమంచిలి, పత్తిపాడు, సింగరాయకొండ, జలదంకి, పొదిలి, చిలకపూడి, పామూరు ప్రాంతాల్లో కేసులు ఉన్నాయని స్పష్టం చేశారు.

నాణ్యత లేని విత్తనాలు అమ్మితే చర్యలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నాణ్యత లేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంలోని పలు విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఎస్.వి.నాగమోహన్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. విత్తన నాణ్యత, స్టాక్ రిజిస్టర్ బుక్‌లు, కొనుగోలు చేసిన రైతుల వివరాలు, బిల్ పుస్తకాలు, రసీదులు తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తీసుకోవాలన్నారు. విత్తన నాణ్యతలో లోపాలు ఉంటే సరైన బిల్లుతో స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలియజేశారు.



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

వంతెనల్లో మురుగునీరు



నగరంలోని రామలింగాపురం, మాగుంటలేవుట్ వంతెనల వద్ద శనివారం రాత్రి వరకు మురుగునీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. టక్కెమిట్ట ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి నీరు మాగుంట లేవుట్ వంతెన మీదుగా ప్రవహించింది. – న్యూస్‌టుడే, నెల్లూరు (జడ్పీ)

ఘనంగా సుకదేవస్వామి జన్మదిన వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిర అధ్యక్షులు సుకదేవస్వామి జన్మదిన వేడుకలు శనివారం ఇస్కాన్ మందిరంలో ఘనంగా జరిగాయి. మందిరంలో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. కేకు కోసి పంచి పెట్టారు.

నేడు సదస్సు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్‌లో భాగంగా నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నామని ఏబీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పెరుగు రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు.

లక్ష్యంతో చదివితే ఉన్నత స్థానం: డీఎంహెచ్‌వో

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: లక్ష్యాన్ని పెట్టుకొని చదివితే ఉన్నత స్థానానికి చేరుకుంటారని డీఎంహెచ్‌వో పెంచలయ్య సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ ఖాదర్‌వలి, డీఐవో ఉమామహేశ్వరి, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పీఎల్ దయాకర్, డెమో కనకరత్నం, డీఎస్‌వో కరుణాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.



విద్యార్థులతో డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీఈవో రామారావు తదితరులు

వైకాపా పాలనలో ఎన్నో ఇబ్బందులు: కోటంరెడ్డి

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో రెవెన్యూ పరంగా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం దేవరపాలెంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. పొట్టేపాలెంలో రూ.20 లక్షలతో కమ్యూనిటీ షెల్టర్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పాలకమండలి మాజీ ఛైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ విజయ్‌కుమార్, దేవరపాలెం ఉప సర్పంచి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.







ఎంపీనగర్ ఒకటో వీధిలో వర్షపునీరు.. సాయినగర్‌లో సిమెంటు రోడ్డుపై.. మాగుంటలేఅవుట్ 5వ క్రాస్‌రోడ్డులో ఒకటిగా మారిన సిమెంటు రోడ్డు, ఖాళీ స్థలం

చినుకు పడితే.. చింతే..

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: చిన్న పాటి వర్షానికే నెల్లూరునగర పరిసర ప్రాంతాల్లోని రహదారులు జలమయమవుతున్నాయి. రోడ్లన్నీ గోతులమయంగా మారుతున్నాయి. మురుగునీటి కాలువలు సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్లపై నిలిచిపోతోంది. గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో రోడ్ల మరమ్మతులు విస్మరించింది. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకం పనుల కోసం ఎక్కడికక్కడ గోతులు తవ్వడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నగరంలోని మనుమసిద్ధినగర్, ఎంపీ కాలనీలో వీధులు దయనీయంగా మారాయి. ప్రధాన రహదారిపై సైతం నీరు నిలిచిపోయింది. మాగుంట లేఅవుట్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద సిమెంటు రోడ్డు, ఖాళీ స్థలం నీటితో ఒకటిలా మారాయి. పొదలకూరు రోడ్డు డైకస్‌రోడ్డు సెంటరు, శ్రామికనగర్, ఇరుగాళమ్మ సంఘం, సాయినగర్ ప్రాంతాల్లోని రోడ్లపై గుంతల్లో నీరు చేరి ఛిద్రంగా తయారయ్యాయి. ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపునీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.